## హత్యకేసులో నిందితులు అరెస్టు

కామారెడ్డి, జనవరి 22 : హత్యకేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ చైతన్యారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలను వెల్లడించారు. ఈ నెల 19వ తేదీన రామారెడ్డి పీఎస్ పరిధిలోని అన్నారం గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతుడు పొక్కిలి రవి(41)గా గుర్తించామని తెలిపారు. కామారెడ్డి ఏఎస్పీ స్పెషల్ టీమ్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తును ప్రారంభించారు. పొక్కిలి కిష్టయ్య, పొక్కిలి కిషన్, షేక్ హఫీజ్, చాకలి నర్సోల్ల రాకేశ్, పొక్కిలి సత్తెవ్వను అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరిని విచారించగా చేసిన నేరం ఒప్పుకున్నారని, వారి నుంచి ఒక సుత్తె, ఒక కర్ర, రెండు మోటర్ సైకిల్, ఒక గొలుసు, 5 ఫోన్లు, రూ.15 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసును ఛేదించిన కామారెడ్డి రూరల్ సీఐ రామన్, రామారెడ్డి ఎస్సై నరేశ్, రవీందర్, క్రైం టీం సిబ్బంది రవికిరణ్, సాయిలు, రాజు, రమేశ్‌ను ఎస్పీ సింధూశర్మ, ఏఎస్పీ చైతన్యారెడ్డి అభినందించారు.

## పనులు వేగవంతం చేయాలి

కామారెడ్డి, జనవరి 22 : జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణ పనులను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు.

## మళ్లీ ప్రమాదాలు జరగకుండా చూడాలి

కామారెడ్డి, జనవరి 22 : జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్‌లో ఉన్న రాజీవ్ పార్క్ పక్కన 33/11 సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మంగళవారం షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. ఈ సబ్‌స్టేషన్‌ను బుధవారం హెచ్ఆర్‌డీ, ఐఆర్ డైరెక్టర్ అశోక్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన గంట 30 నిమిషాల్లో విద్యుత్ సరఫరా అన్ని ప్రాంతాలకు పునరుద్ధరించడం అభినందనీయమని అన్నారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కొత్త ట్రాన్స్ ఫార్మర్ అలాట్ చేశామన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రవణ్, డీఈఈ కళ్యాణ్ చక్రవర్తి, ప్రభాకర్, నాగరాజు, స్వామి, కిరణ్, చైతన్య, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## మినీ హెల్త్‌సెంటర్ ఏర్పాటు చేయాలి

మాచారెడ్డి, జనవరి 22 : మండలంలోని బంజపల్లి గ్రామంలో మినీ హెల్త్‌సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం గ్రామ కార్యదర్శికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. అత్యవసర సమయంలో వైద్యం కోసం 16 కి.మీ దూరం ఉన్న మాచారెడ్డి కి వెళ్లాల్సి వస్తున్నదని తెలిపారు. బహుజన సమాజ్ పార్టీ మండలాధ్యక్షుడు హరిలాల్‌నాయక్, కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు సంజీవ్‌నాయక్, అనిల్, మోహన్, శ్రీను ఉన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల ధర్నా

ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భిక్కనూరు, జనవరి 22 : మండల కేంద్రంలోని టోల్ ప్లాజా వద్ద కార్మికులకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. టోల్ ప్లాజాలో తొమ్మిదేండ్లుగా పనిచేస్తున్న 77 మంది సిబ్బందికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 77 మందిలో ఏఒక్క కార్మికుడికి అన్యాయం జరిగినా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తునికి వేణు, ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పోతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సాయిరెడ్డి, విండో చైర్మన్లు వెంకట్‌రెడ్డి, భూంరెడ్డి, స్వామి, వైస్ చైర్మన్ వాసు యాదవ్, నాయకులు, టోల్ ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

# నిరసనలు, నిలదీతలు..

- రసాభాసగా మారిన గ్రామసభలు
- జాబితాల్లో అనర్హుల పేర్లు రావడంతో అధికారులను నిలదీసిన ప్రజలు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 22 : ప్రజాపాలన గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోని వారు ప్రస్తుత నిర్వహిస్తున్న గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తెలిపారు. తాడ్వాయి మండలంలోని బ్రహ్మణిపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఎల్లారెడ్డి మండలంలోని గ్రామాలు, పట్టణంలోని వార్డుల్లో నిర్వహించిన సభల్లో ఆర్డీవో మన్నె ప్రభాకర్ పాల్గొన్నారు. గాంధారి మండలంలోని ఆయా గ్రామాల్లో పథకాలకు సంబంధించి జాబితాల్లోని లబ్ధిదారుల వివరాలు చదివి వినిపించారు. జాబితాలో తమ పేర్లు రాలేదని, అనర్హుల పేర్లు ఇండ్ల జాబితాలో వచ్చాయని పలువురు గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగిరెడ్డిపేటలో నిర్వహించిన సభలో రైతులు మాట్లాడారు. తమ తాతల నుంచి వారసత్వంగా సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వకుండా అధికారులు తమ కడుపుకొడ్తున్నారనీ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లింగంపేట మండలంలో గ్రామసభలు నిర్వహించారు. శెట్పల్లిలో ఆత్మీయ రైతు భరోసా పథకంలో 44 మందిని ఎంపిక చేసినట్లు అధికారులు పేర్లు చదివి వినిపించారు. పేర్లు తప్పుగా రావడంపై అధికారుల తీరుపై గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. పర్మళ్ల, శెట్పల్లిసంగారెడ్డి తదితర గ్రామాల్లో రేషన్ కార్డుల జాబితాలో పేర్లు రాకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని పలు గ్రామాల్లో దరఖాస్తులు చేసుకోవడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిట్లం మండలంలోని మార్థండలో ఉదయం 10.45 గంటలైనా అధికారులు సభకు హాజరు కాలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని గోద్మెగాం, మార్థండలో నిర్వహించిన గ్రామ సభలకు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి హాజరై దరఖాస్తులను పరిశీలించారు. సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లిలో అర్హుల జాబితాలో తమ పేర్లు లేవని ప్రజలు ఆందోళన చేశారు. బిచ్కుంద మండలం గోపన్‌పల్లిలో ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభ రసాభాసగా సాగింది. జాబితాలో పేర్లు రాని వారు గ్రామ సభ వద్ద ధర్నా నిర్వహించారు. మహ్మద్‌నగర్ మండలం కోమలంచలో అర్హుల జాబితా చదివి వినిపించడంతో ప్రజలు వాగ్వాదానికి దిగారు. అర్హుల జాబితాలో అవకతవకలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సభను అర్ధంతరంగా ముగించి అధికారులు వెళ్లిపోయారు.

తుజాల్‌పూర్‌లో ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లోని గ్రామాల్లో నిరసనలు, నిలదీతల మధ్య గ్రామ సభలు కొనసాగాయి. పథకాలు రాక, ఉన్న భూమిని సైతం కోల్పోయి రెండు రకాలుగా నష్ట పోతున్నామని పలువురు లబ్ధిదారులు అధికారులను నిలదీశారు. ప్రస్తుతం సాగుకు యోగ్యం కాని భూములకు రైతు భరోసా ఇవ్వమనడం సరికాదని, తమకు న్యాయం చేయాలంటూ లబ్ధిదారులు అధికారులను కోరారు. దీంతో ఎస్సై లావణ్య, పోలీసు సిబ్బంది ప్రజలను సముదాయించి శాంతిపజేశారు. విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి అక్కడికి చేరుకొని లబ్ధిదారులతో మాట్లాడారు. ఉపాధి హామీ పనులు 20 రోజులు చేసిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తామనడం ఏమిటని బీఆర్ఎస్ నాయకులు అధికారులను ప్రశ్నించారు. అన్ని పథకాలు వచ్చేలా చూడాలని కోరారు.

బాన్సువాడ మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ ఆవరణలో గ్రామసభలు ఏర్పాటు చేశారు. గ్రామ సభల్లో రేషన్‌కార్డు కోసం అధికారులను గ్రామస్తులు నిలదీశారు. మాచారెడ్డి మండలంలోని ఆయా గ్రామాల్లో గ్రామసభలను తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. పథకాల్లో పేర్లు రాకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పి అధికారులు వెళ్లిపోతున్నారని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. గ్రామసభల్లో ఎక్కువ శాతం రేషన్ కార్డుల కోసమే దరఖాస్తు చేసుకుంటున్నారు.

బీబీపేట మండలంలోని తుజాల్‌పూర్, మల్కాపూర్, ఇస్సానగర్‌లో నిర్వహించిన గ్రామ సభలు రసాభాసగా మారాయి. తుజాల్‌పూర్‌లో అర్హులైన వారి పేర్లు జాబితాలో రాలేదని గ్రామస్తులు ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్ నిలదీశారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రభాకర్ సభకు చేరుకొరుని గ్రామస్తులను సముదాయించారు.

కామారెడ్డి మండలం శాబ్దీపూర్, సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లిలో నిర్వహించిన గ్రామ సభల్లో అదనపు కలెక్టర్ విక్టర్ పాల్గొన్నారు. జాబితాల్లో పేర్లురానివారు దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. దోమకొండ మండలంలోని అంచనూర్, చింతామన్‌పల్లి, గొట్టిముక్కులలో గ్రామ సభలు నిర్వహించినట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

పోచారం గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

గోపన్‌పల్లిలో ధర్నా చేస్తున్న గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

జగన్నాథ్‌పల్లిలో ఉదయం 11గంటలైనా గ్రామసభ ప్రారంభించని అధికారులు

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి

బీబీపేట్(దోమకొండ), జనవరి 22 : ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి రైతు మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన మొగుల్ల సిద్ధయ్య(59) గ్రామ శివారులో రాత్రిపూట అడవి పందుల బెడద ఎక్కువగా ఉండడంతో ప్రతి రోజు మక్కజొన్న పంట చుట్టూ జియో వైర్ చుట్టి కరెంట్ కనెక్షన్ ఇచ్చాడు. మరునాడు తెల్లవారుజామున తీసివేసేవాడన్నారు. బుధవారం ఉదయం మక్కజొన్నకు పెట్టిన కరెంట్‌ను తీసివేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందాడు. మృతుడి భార్య బీరవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## జాబ్ మేళాకు విశేష స్పందన

కామారెడ్డి, జనవరి 22 : జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ) ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో వివిధ ప్రాంతాల నుంచి 255 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. ఇందులో 51 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. టాస్క్ ఆర్ఎం శ్రీనాథ్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ హరిస్మరణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ సాయిబాబు, అకాడమిక్ ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్, టాస్క్ ఇన్‌చార్జి గణేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## హోంగార్డును అభినందించిన కలెక్టర్

కామారెడ్డి, జనవరి 22 : టాటా సంస్థ ఇటీవల నిర్వహించి ముంబై అంతర్జాతీయ మారథాన్ పోటీల్లో కామారెడ్డి జిల్లా రవాణా శాఖ హోంగార్డు అశోక్ పాల్గొని నాలుగో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌ను ఆయన బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో రవాణా శాఖాధికారి శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 'రిపబ్లిక్' పరేడ్‌కు విద్యార్థుల ఎంపిక

మాచారెడ్డి, జనవరి 22 : ఈ నెల 26వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే ఆర్డీ పరేడ్‌కు మాచారెడ్డి మండంలోని ఘన్‌పూర్, సోమార్‌పేట విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శారద, భాస్కర్ తెలిపారు. జిల్లా నుంచి ఎంపిక కావడంపై స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

## మున్నూరుకాపు యువత నూతన కమిటీ

నస్రుల్లాబాద్, జనవరి 22 : బీర్కూర్ మండల మున్నూరుకాపు యువత నూతన కమిటీని బుధవారం మున్నూరు కాపు యువత రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆదేశాల మేరకు ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బొగొడమీది సాయి, ఉపాధ్యక్షులుగా అరిగె ధర్మతేజ్, కళ్ల సాయికుమార్, కార్యదర్శిగా గంగాధర్, సంజీవ్, ప్రధాన కార్యదర్శిగా రెంజర్ల అనిల్, కోశాధికారిగా మేకలగాలు, సోషల్ మీడియా కన్వీనర్‌గా కొట్టె వినేశ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్నూరుకాపు రాష్ట్ర కార్యదర్శి దొంగ్లీ శ్రీనివాస్, బాన్సువాడ మున్నూరు కాపు యువత కన్వీనర్ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మాస్టర్ ప్లాన్ రద్దుకు కృషి చేస్తా

కామారెడ్డి, జనవరి 22 : కామారెడ్డి మాస్టర్ ప్లాన్ రద్దుకు కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియ అన్నారు. మాస్టర్ ప్లాన్ బాధితులతో మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాస్టర్ ప్లాన్ బాధితులు అధైర్యపడొద్దని, రైతన్నలకు సహకారాలు అందిస్తానని అన్నారు.

## తహసీల్దార్ ఎదుట బైండోవర్

భిక్కనూరు, జనవరి 22 : 'డయల్ 100'కు పలు మార్లు కాల్ చేసిన యువకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. భిక్కనూరుకు చెందిన ముగ్గురు, చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన యువకులను బుధవారం అదుపులోకి తీసుకొని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్‌గా నవీన్ నాయక్

కామారెడ్డి, జనవరి 22 : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్‌గా నవీన్ నాయక్‌ను నియమించారు. రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కళాశాల విభాగం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ యల్లా పోశెట్టి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

## ముందు వచ్చిన వారికి ముందుగా సీట్లు

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 22: ఎల్లారెడ్డి పట్టణంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ రఫత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో పూర్తి 40 సీట్లతో , 6,7,8,9 తరగతుల్లో పరిమిత సంఖ్యలో బ్యాగ్‌లాగ్ మైనారిటీ కేటగిరీ సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుకున్న విద్యార్థులు 5వ తరగతిలో ప్రవేశానికి అర్హులన్నారు. 5వ తరగతిలోని మొత్తం 40 సీట్లకు 30 సీట్లు మైనారిటీ విద్యార్థులకు, 5 సీట్లు బీసీలకు, 2 సీట్లు ఎస్సీ, 2 సీట్లు ఎస్టీ, ఒక సీటు ఓసీలకు కేటాయిస్తామన్నారు. మైనారిటీలలో ముందుగా వచ్చిన వారికి ముందుగా సీట్లు కేటాయించే విధానం అమలు చేస్తామని పేర్కొన్నారు. నాన్ మైనారిటీ సీట్లకు వచ్చిన దరఖాస్తుల్లో లక్కీ డీప్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థులు అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, పాఠశాలకు వచ్చిన వారికి ఉచితంగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసి ఇస్తామని పేర్కొన్నారు. వివరాలకు 7331170815, 9705346569 నంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

**మైనారిటీ గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం..**

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 22: ఎల్లారెడ్డి పట్టణంలోని మైనారిటీ గురుకుల కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ షరీఫ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనారిటీ, మైనార్టీయేతర విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు tgmreistelangana.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9490863874, 9533123331, 8074577592 నంబర్లను గానీ, మైనారిటీ గురుకుల కళాశాలలో ఉదయం 9గంటల నుంచి 4-30 వరకు సంప్రదించవచ్చన్నారు. విద్యార్థులు ఫిబ్రవరి 28వతేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

## బడిబయటి విద్యార్థుల గుర్తింపు

లింగంపేట, జనవరి 22: మండలంలోని ఆయా గ్రామాల్లో బడి బయటి విద్యార్థుల గుర్తింపు కోసం సర్వే నిర్వహించినట్లు ఎంఈవో షౌకత్ తెలిపారు. బడి ఈడు కలిగిన విద్యార్థులు పనుల్లో కాకుండా పాఠశాలల్లో ఉండాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులతో చదువుమానేసిన విద్యార్థులకు వసతి గృహాల్లో చేర్పించనున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం నిర్వహించిన సర్వేలో ఇద్దరు విద్యార్థులను గుర్తించామన్నారు. సర్వేలో సీఆర్పీలు సత్యనారాయణ, గంగాధర్, విజయ్, రాజు తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ దవాఖానల తనిఖీ

బిచ్కుంద, జనవరి 22 : జుక్కల్, బిచ్కుంద మండల కేంద్రాల్లోని ప్రభుత్వ దవాఖానలను జిల్లా వైద్యశాఖ సూపరింటెండెంట్ (డీసీహెచ్) విజయలక్ష్మి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానల్లో రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మందుల నిల్వ వివరాలను ఫార్మాసిస్ట్‌ను అడిగి మందుల కొరత ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. బిచ్కుంద దవాఖాన అంతా కలియతిరిగి చూసి గదులన్నీ శుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. పేషెంట్లతో మాట్లాడి సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. పనితీరు బాగా లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సాధ్యమైనంత వరకు వచ్చిన రోగులకు వైద్యం అందించాలని, అత్యవసర సమయాల్లో మాత్రమే జిల్లా దవాఖానకు రిఫర్ చేయాలన్నారు. ఈ సందర్భంగా దవాఖాన సూపరింటెండెంట్ కాళిదాసు వైద్యుల కొరత ఉన్నదని డీసీహెచ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆమె పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బిచ్కుంద ప్రభుత్వ దవాఖాన ల్యాబ్‌లో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీసీహెచ్ విజయలక్ష్మి

# వసతిగృహంలో చదువుకునే వాతావరణం కల్పించాలి

- రాష్ట్ర ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి హరిత

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 22: వసతిగృహంలో బాలికలకు మంచిగా చదువుకునే విధంగా వాతావరణాన్ని కల్పించాలని రాష్ట్ర ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి హరిత సూచించారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల వసతిగృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు.విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. కిచెన్ రూంను పరిశీలించి, విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. గిరిజన గురుకుల బాలికల పాఠశాల, వసతిగృహంలోని మౌలిక సదుపాయాలు, విద్యాబోధన, విద్యార్థులకు పెడుతున్న భోజనంపై ఆమె బాలికలతో మాట్లాడారు. ఆమెవెంట పాఠశాల ప్రిన్సిపాల్ సావిత్రి, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

ఎల్లారెడ్డి గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి బస చేసిన రాష్ట్ర ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి హరిత

# రెండు వేల ఎకరాల్లో ఆయిల్ పాం ఏర్పాటు లక్ష్యం

- జిల్లా హార్టికల్చర్ అండ్ సెరీకల్చర్ అధికారిణి జ్యోతి

నాగిరెడ్డిపేట, జనవరి 22: జిల్లాలో ఈయేడు రెండు వేల ఎకరాల్లో ఆయిల్‌పాం ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా హార్టికల్చర్ అండ్ సెరీకల్చర్ అధికారిణి జ్యోతి తెలిపారు. బుధవారం ఆమె 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, పెద్దరైతులకు 80 శాతం, చిన్న సన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై ఆయిల్ పాం యూనిట్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఆయిల్‌పాం ఏర్పాటు చేసుకున్న రైతులకు ప్రతియేటా ఎకరానికి రూ.4,200 చొప్పున నాలుగేండ్లపాటు అందిస్తామన్నారు. ఐదో యేట నుంచి పంట ఎకరానికి 12 నుంచి 15 టన్నుల దిగుబడి వస్తుందని, టన్ను ధర రూ. 20వేల వరకు ఉంటుందన్నారు. అంతర పంటలు గా కంది, పెసర, ఇతర పప్పు దినుసులు వేసుకోవచ్చని, తద్వారా అదనపు దిగుబడి పొందవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో 657 ఎకరాలు మంజూరు చేశామని, అందులో 318 ఎకరాలు ఆయిల్‌పాం మొక్కలు నాటడం పూర్తి చేసినట్లు చెప్పారు. అలాగే చెరుకు, కూరగాయల సాగుకు రాయితీపై డ్రిప్, స్ప్రింప్లర్ యూనిట్లు అందిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో 3,500 ఎకరాల చెరుకు పంటకు డ్రిప్ లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటి వరకూ 1,100 ఎకరాలకు మంజూరు చేశామన్నారు. 550 ఎకరాలు కూరగాయల పంటలకు డ్రిప్, స్ప్రింప్లర్ యూనిట్లు మంజూరు ఉండగా వంద శాతం ఇచ్చామన్నారు. జిల్లాలోని మాల్తుమ్మెద ఉద్యాన క్షేత్రం, భిక్కనూర్ మండలంలోని పట్టుపరిశ్రమ క్షేత్రంలో నిధులు, సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు.

### విద్యార్థులు దేశం గర్వపడే పౌరులుగా తయారు కావాలి

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 22: విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నతస్థానాల్లో స్థిరపడి, దేశం గర్వపడే పౌరులుగా తయారు కావాలని మండలంలోని అడ్విలింగాల్ గ్రామస్తుడు గుడిపల్లి సంగమేశ్వర్‌రెడ్డి అన్నారు. గ్రామంలోని ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం రూ.30 వేల నగదును ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందానికి బుధవారం ఆయన అందజేసి మాట్లాడారు. అనంతరం పాఠశాల హెచ్ఎం మాట్లాడుతూ గతంలో కూడా పాఠశాల అభివృద్ధికి రూ.20 వేలను సంగమేశ్వర్‌రెడ్డి అందజేశారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సంగమేశ్వర్‌రెడ్డి ప్రాథమిక పాఠశాలకు సైతం రూ. 5వేల నగదును అందజేశారు.

## దివ్యాంగుల ఎంపిక శిబిరం

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 22: ఎల్లారెడ్డి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వికలాంగుల ఉపకరణాల ఎంపిక శిబిరాన్ని హైదరాబాద్ అలీంకో, జిల్లా సంక్షేమ అధికారి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. శిబిరానికి నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి 1200 మంది దివ్యాంగులు హాజరు కాగా, అందులో 587 మంది దివ్యాంగులను గుర్తించారు. వీరికి అలీంకో కంపెనీ ద్వారా ఉపకరణాలు పంపిణీ చేస్తామని శిబిరం నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో మన్నె ప్రభాకర్, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, మార్కెట్ కమిటీ చైర్మన్ రజితారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఎల్లారెడ్డి సొసైటీ వైస్‌చైర్మన్ మత్తమాల ప్రశాంత్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల తనిఖీలు

నాగిరెడ్డిపేట, జనవరి 22: మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను సామాజిక తనిఖీ సిబ్బంది కొలతలు వేస్తున్నట్లు ఈజీఎస్ ఏపీవో సాయిలు తెలిపారు. మండలంలోని 25 గ్రామాల పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను సామాజిక తనిఖీ సిబ్బంది క్షేత్ర స్థాయి పరిశీలన చేసి కొలతలు వేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 23 నుంచి 27 వరకు గ్రామాల వారీగా గ్రామ సభలు ఏర్పాటు చేసి చేపట్టిన పనులపై సభలో చర్చిస్తామన్నారు.

## బాధ్యతతో కొలతలు వేయాలి

నాగిరెడ్డిపేట, జనవరి 22: మండలంలోని ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులకు బాధ్యతతో, తప్పులు జరగకుండా కొలతలు వేసి నివేదికలను తయారు చేయాలని సామాజిక తనిఖీ సిబ్బందికి జిల్లా రిసోర్స్ పర్సన్ తిరుపతి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ ఏపీవో సాయిలు 2024-25 సంవత్సరంలో చేపట్టిన పనుల రికార్డులను వారికి అంద జేశారు. వాటిని నిశితంగా పరిశీలించి క్షే